సాక్షి
అనకాపల్లి
గురువారం । 27 । జూన్ । 2024



దక్షిణామూర్తి పరమహంస ఆరాధన

సీతంపేట(విశాఖ): శ్రీలలితా పీఠం వ్యవస్థాపక పీఠాధిపతి దక్షిణామూర్తి పరమహంస ఆరాధనను బుధవారం నిర్వహించారు.



కేజీహెచ్ కిటకిట

కేజీహెచ్‌లో రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మందులు ఇచ్చే కౌంటర్లు కూడా రద్దీగా ఉంటున్నాయి. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
33.3/25.0

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్లపడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

జోన్‌కు రెడ్ సిగ్నల్!

2019 ఫిబ్రవరి 27 విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వేజోన్ ఏర్పాటు చేస్తామంటూ కేంద్రం ప్రకటన

2019 మార్చి 08 సౌత్ కోస్ట్ రైల్వేజోన్ ఓఎస్‌డీగా ఎస్.ఎస్.శ్రీనివాస్ నియామకం. డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశాలు

2019 జూలై 01 శ్రీనివాస్ స్థానంలో ఓఎస్‌డీగా సీనియర్ అధికారి ధనుంజయులు నియామకం

2019 సెప్టెంబర్ మొదటి వారం జోన్ సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) రైల్వే బోర్డుకు అందజేత

2019 సెప్టెంబర్ 2వ వారం రైల్వే మంత్రిత్వ శాఖకు, కొత్త జోన్‌తో సంబంధం ఉన్న వివిధ జోన్‌లకు సలహాలు, సూచనల కోసం డీపీఆర్ ప్రతులను అందించిన రైల్వే బోర్డు.

2022 నవంబర్ 11న అప్పటి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మించే స్థలంతో పాటు భవనాల డిజైన్ల పరిశీలన

2022 నవంబర్ 12న దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభోత్సవం శంకుస్థాపన చేసేందుకు శిలాఫలకం కూడా సిద్ధమైపోయింది. కానీ రాత్రికి రాత్రే కార్యక్రమం నిలిచిపోయింది.

ఇక అప్పటి నుంచి ఏవో కుంటిసాకులు చెబుతూ రైల్వే జోన్ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ఇటీవల ఏర్పడిన కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) ప్రభుత్వానికి రైల్వే జోన్ డిమాండ్ చేసే అవకాశం ఉన్నా.. కేవలం మంత్రి పదవుల కోసం ఉత్తరాంధ్ర ప్రజల ఆశలను కేంద్రానికి తాకట్టు పెట్టింది.





- దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను అటకెక్కించిన కూటమి ప్రభుత్వం
- కేంద్రానికి ఇచ్చిన డిమాండ్లలో కనిపించని జోన్ అంశం
- జోన్ ఇప్పట్లో లేదంటూ రైల్వే ఉద్యోగులకు బోర్డు సంకేతాలు

సాక్షి, విశాఖపట్నం : ఏ ప్రాజెక్టుకైనా డీపీఆర్ అందించిన 30 నుంచి 60 రోజుల్లో పరిశీలన పూర్తి చేసి కార్యకలాపాలపై దృష్టిసారించాల్సి ఉంటుంది. కానీ.. దక్షిణ కోస్తా జోన్‌కు సంబంధించిన డీపీఆర్ అందించి ఏళ్లు గడిచినా కేంద్రం పట్టించుకోలేదు. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు 2019లో కేంద్రం పచ్చజెండా ఊపడం.. కొత్త జోన్‌కి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) సిద్ధం చేసేందుకు ప్రత్యేకాధికారి(ఓఎస్‌డీ)ని నియమించడం.. జోన్‌కి సంబంధించిన డీపీఆర్‌ని రైల్వే బోర్డుకు సమర్పించడం అన్ని చకచకా జరిగిపోయాయి. 2020 లేదా 2021 జనవరిలో గానీ మార్చిలో గానీ రైల్వేజోన్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని అంతా ఊహించారు. కానీ.. జోన్ విశాఖకు ఇప్పట్లో అందించేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం అంగీకరించడంలేదు. దశాబ్దాల కల నెరవేరుస్తూ విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ప్రారంభించేందుకు తీసుకోవాల్సిన కీలక నిర్ణయంపై రైల్వేబోర్డు నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది.

వైఎస్సార్‌సీపీ పోరాటంతోనే..

జోన్ ఏర్పాటు కోసం దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నా.. రాష్ట్ర విభజన తర్వాత ఆ బాధ్యతను అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన భుజస్కంధాలకు ఎత్తుకుంది. జోన్ ఏర్పాటు చేయాలంటూ నిరసన ప్రదర్శనలు, రైల్‌రోకోలు చేసి జోన్ ప్రకటన వచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చింది. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వాల్తేరు డివిజన్ కొనసాగించాలంటూ పోరాటం చేశారు. రాజ్యసభ సభ్యుడు వై.విజయసాయిరెడ్డి నేతృత్వంలో అప్పటి ఎంపీలు డా.బీశెట్టి సత్యవతి, ఎంవీవీ సత్యనారాయణతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన ఎంపీలు కూడా డివిజన్ కొనసాగింపుపై ఎప్పటికప్పుడు పార్లమెంట్‌లోనూ ప్రత్యక్షంగా ప్రధాని, రైల్వే మంత్రిని కలిసి వినతిపత్రాలు అందించారు. ఈ కారణంగానే వైఎస్సార్‌సీపీకి ఆ ఘనత దక్కకుండా కుయుక్తులు పన్నారు.

జోన్‌ను తాకట్టు పెట్టేసిన టీడీపీ, జనసేన

బీజేపీ భాగస్వామ్యంతో రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టీడీపీ, జనసేన పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వే జోన్ అంశాన్ని అటకెక్కించేశాయి. ఎన్‌డీఏ కూటమిలో ప్రస్తుతం టీడీపీనే కీలకం. ఈ సమయంలో రైల్వే జోన్ డిమాండ్‌ను టీడీపీ, జనసేన.. కేంద్రం ముందు పెడితే కచ్చితంగా జోన్ ఫైల్ ముందుకు కదిలేది. కానీ తమకు స్వప్రయోజనాలే ముఖ్యమని భావించి.. కేవలం మంత్రి పదవుల కోసం జోన్ అంశాన్ని ప్రస్తావన తీసుకురాక పోవడం ఉత్తరాంధ్ర వాసుల్ని విస్మయానికి గురి చేస్తోంది.

అదేవిధంగా ఇటీవల వాల్తేరు డివిజన్ ఉద్యోగులకు కూడా జోన్ ఇప్పట్లో రాదనే సంకేతాలు ఉన్నతాధికారుల నుంచి అందినట్లు తెలిసింది. జోన్ ఏర్పాటు చేస్తే వాల్తేరును రెండుగా విభజించి.. రాయగడ, విజయవాడ డివిజన్లలో విలీనం చేయాల్సి ఉంది. ఈ తరుణంలో ఉద్యోగుల విభజన కూడా జరగనుంది. కానీ.. ఇప్పట్లో.. విభజన ప్రక్రియ ఏమీ లేదనీ.. ఎవరూ ఎలాంటి దరఖాస్తులు చేసుకోవద్దని ఉన్నతాధికారులు స్పష్టమైన సంకేతాలిచ్చినట్లు సమాచారం. మొత్తంగా వైఎస్సార్‌సీపీ పోరాటాల్ని, విశాఖ యువత ఆశల్ని రాష్ట్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అడియాశలు చేసేసింది. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరికను రాజకీయాలకు బలిచేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భూముల పేరుతో దొంగాట

ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జోన్‌కు అవసరమైన భూములివ్వలేదంటూ ఆరోపించారు. భూములిచ్చిన తర్వాత అవి ముంపు భూములంటూ కొత్త పల్లవి అందుకున్నారు. రైల్వేకి ముడసర్లోవ ప్రాంతంలో అప్పగించిన స్థలం ముంపు ప్రాంతం కాదనీ, మిక్స్‌డ్ జోన్ అని జిల్లా యంత్రాంగంతో పాటు వాల్తేరు డివిజన్ అధికారులు కూడా స్పష్టం చేసినా జోన్ ఇవ్వడం ఇష్టం లేని ఎన్‌డీఏ ప్రభుత్వం తాత్సారం చేస్తోంది.

శిలాఫలకం దాచేశారు..!

ముందుగా జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి డీఆర్‌ఎం కార్యాలయం ఎదురుగా ఉన్న వైర్‌లెస్ కాలనీని ఎంపిక చేశారు. వైర్‌లెస్ కాలనీలో ఉన్న 13 ఎకరాల్లో 8 ఎకరాల విస్తీర్ణంలో హెడ్‌క్వార్టర్స్‌కు సంబంధించి డిజైన్లకు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆమోదముద్ర వేశారు. కాలనీని సైతం పరిశీలించారు. రూ.106 కోట్ల వ్యయంతో జోన్ ప్రధాన కార్యాలయానికి టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమయ్యారు. టెండర్లు ఖరారు చేసిన తర్వాత అగ్రిమెంట్ జరిపి.. 36 నెలల్లో భవనాన్ని పూర్తి చేయాలని రైల్వే అధికారులు భావించారు. 2022 నవంబర్ 12న ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారనీ.. శిలాఫలకం కూడా సిద్ధం చేశారు. కానీ 11వ తేదీ అర్ధరాత్రి 12 గంటల తర్వాత జోన్ శంకుస్థాపన కార్యక్రమాన్ని వాయిదా వేసేశారు.

సిద్ధం చేసిన శిలాఫలకాన్ని దాచేశారు. దీనంతటికీ కారణం స్థానిక బీజేపీ, టీడీపీ నేతలని ఆరోపణలు గతంలోనే వినిపించాయి. అప్పుడు శంకుస్థాపన చేస్తే క్రెడిట్ అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందనే రాజకీయ కుట్రతో ఉత్తరాంధ్ర వాసుల కలల్ని కల్లలు చేసేశారు.



మాయమైన 'జోన్' శిలాఫలకం

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో 34.41 శాతం ఉత్తీర్ణత

తుమ్మపాల: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ ఫలితాల్లో జిల్లాలో 34.31 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టు ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి బి.సుజాత తెలిపారు. 4,336 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయగా 1,488మంది ఉత్తీర్ణులైనట్టు పేర్కొన్నారు. 773 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 317 మంది ఉత్తీర్ణులై 41శాతం ఫలితాలు సాధించినట్టు చెప్పారు. రెగ్యులర్ విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 451 మంది, ప్రైవేటు కళాశాలల్లో 764 మంది, ఏపీ సోషల్ వెల్ఫేర్ కాలేజీల్లో 94, బీసీ వెల్ఫేర్ కాలేజీల్లో ముగ్గురు, హెచ్‌ఎస్ ప్లస్ 21, కేజీబీవీల్లో 71, మోడల్ స్కూల్ 45, ఏఎంఎల్ 14, ఎయిడెడ్ కళాశాలల్లో 25 మంది ఉత్తీర్ణులైనట్టు ఆమె తెలిపారు. ఒకేషనల్‌లో జీజేసీ 123, కేజీబీవీ 22, ప్రైవేటు కళాశాలల్లో 158, ఎయిడెడ్ కళాశాలల్లో 14 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 5,109 మంది పరీక్షలు రాయగా 1,805 మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీలో 54.37 శాతం ఉత్తీర్ణత

అనకాపల్లి: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో అనకాపల్లి జిల్లా 54.37 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 3,031 మంది విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకాగా, 1,648 మంది ఉత్తీర్ణలైనట్లు పేర్కొన్నారు. బాలురు కంటే బాలికలే ఎక్కువ శాతం పాసయ్యారని తెలిపారు. 1,928 మంది బాలురలో 53.79 శాతంతో 1,037 మంది, 1,103 మంది బాలికల్లో 55.39 శాతంతో 611 మంది ఉత్తీర్ణులయ్యారని వెల్లడించారు.

యూసీడీ ఇన్‌చార్జి పీడీగా ఫణిరామ్

డాబాగార్డెన్స్(విశాఖ): జీవీఎంసీ యూసీడీ పీడీగా ప్రాజెక్ట్ ఆఫీసర్ ఫణిరామ్ నియమితులయ్యారు. యూసీడీ పీడీగా ఉన్న కేవీ పాపునాయుడు దీర్ఘకాల సెలవులో ఉన్న కారణంగా ఫణిరామ్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.

అదుపులో జ్వరాలు



అర్లలో రక్త పూతలు తీస్తున్న హెల్త్ అసిస్టెంట్ హరిబాబు

రోలుగుంట: మండలంలోని అర్ల గిరిజన గ్రామంలో ప్రబలిన జ్వరాలు అదుపులోకి వచ్చాయి. జ్వరాల నియంత్రణ కోసం గ్రామ సర్పంచ్ వండల వనిత అభ్యర్థన మేరకు బుచ్చింపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమ,మంగళ,బుధవారాలు మూడు రోజుల పాటు వైద్యాధికారి శ్రీనివాసరాజు వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరపీడితులకు వైద్య సేవలు, మందులు అందజేశారు. హెల్త్ అసిస్టెంటు హరిబాబు, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తతో కలసి మూడు రోజుల పాటు ఇంటింటా తిరిగి రక్తపూతలు తీశారు. ఈవోపీఆర్డీవో ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి కాశిం వీధుల్లో చెత్త, కాలువల్లో పూడికలు తీయించారు. బావులు, తాగునీటి బోర్ల వద్ద శుభ్రం చేయించి బ్లీచింగు జల్లించారు.

'కనకమహాలక్ష్మి'కి ఇల్లు బహూకరణ



ఈవో శ్రీనివాసులరెడ్డితో గంటి కుటుంబ సభ్యులు

డాబాగార్డెన్స్(విశాఖ): కనకమహాలక్ష్మి దేవస్థానానికి రూ.40 లక్షల విలువ చేసే తమ ఇంటిని గంటి కుటుంబ సభ్యులు విరాళంగా అందజేశారు. పాతనగరం పల్లావారి వీధికి చెందిన గంటి కామేశ్వరరావు, గంటి ప్రభాకర్, గంటి అరుణ్‌కుమార్, గంటి శ్యామలా దేవికి సంయుక్తంగా 83.33 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న గ్రౌండ్, మొదటి అంతస్తు గల ఇల్లు (డోరు నంబరు 25-5-1) ఉంది. గంటి లక్ష్మీనరసమ్మ వారసులైన వీరంతా కనకమహాలక్ష్మి దేవస్థానం పేరిట జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి.. ఆ ఇంటి తాళాలను బుధవారం ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డికి అందజేశారు. రోజురోజుకూ ఆలయానికి భక్తుల రద్దీ పెరుగుతోంది. భక్తులకు మెరుగైన వసతులు కల్పించడంలో భాగంగా స్థల సేకరణ చేస్తున్న ప్రస్తుత తరుణంలో విలువైన గృహాన్ని దేవస్థానానికి గంటి కుటుంబ సభ్యులు అందజేయడం అభినందనీయమని ఈవో తెలిపారు. ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.50 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గత 28 రోజులకు గాను రూ.2 కోట్ల 50 లక్షల 52 వేల 507 వచ్చినట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై యాత్రి సదన్‌లో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 183.200 గ్రాముల బంగారం, 15,125 కిలోల వెండి లభించినట్టు పేర్కొన్నారు. లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వర్షం

- పిడుగుపాటుకు యువకుడి మృతి
- లోతట్టు ప్రాంతాలు జలమయం



యలమంచిలి ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో చేరిన వర్షం నీరు

యలమంచిలి రూరల్/తుమ్మపాల: జిల్లాలో పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం పడింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో సుమారు రెండు గంటల పాటు వర్షం కురిసింది. మాడుగుల మండలం గాదిరాయిలో పిడుగుపడి ఓ యువకుడు మృతి చెందాడు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విత్తనాలు విత్తే సమయానికి వరుణుడు కరుణించడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజులుగా తీవ్ర ఉక్కపోతకు గురైన ప్రజలు ఉపశమనం పొందారు. ఈ వర్షం సాగుకు మేలు చేస్తుందని వ్యవసాయాధికారులు తెలిపారు. భారీ వర్షం కురవడంతో యలమంచిలి పట్టణమంతా తడిసి ముద్దయ్యింది. పలు ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో చెరువులను తలపించాయి. మురుగు కాల్వల్లో నీరు రోడ్లపైకి పొంగి ప్రవహించింది. పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గాంధీనగరం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానం, ఎల్‌బీసీ కూడలి సహా పలుచోట్ల వర్షపు నీరు నిలిచిపోయింది. జిల్లాలో అత్యధికంగా యలమంచిలి మండలంలో 55.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదుకాగా, అత్యల్పంగా పరవాడ మండలంలో 1.0 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైందని జిల్లా గణాంక ప్రణాళిక అధికారి జి.రామారావు తెలిపారు.

మండలాల వారీగా వర్షపాతం వివరాలు

యలమంచిలి 55.6 మిల్లీమీటర్లు చీడికాడ 49.0 మిల్లీమీటర్లు, సబ్బవరం 47.2, కె.కోటపాడు... కొంకోట 44.4, మునగపాక 40.2, రాంబిల్లి 38.4, మాడుగుల 32.8, చోడవరం 24.8, రావికమతం 24.6, రోలుగుంట 18.4, అనకాపల్లి 15.8, గొలుగొండ 11.2, దేవరాపల్లి 10.4, నర్సీపట్నం 10.6, కోటవురట్ల 9.0, మాకవరపాలెం 8.2, కె.కోటపాడు 8.0, నక్కపల్లి 7.0, నాతవరం 6.8, బుచ్చెయ్యపేట 5.4, అచ్యుతాపురం 5.0, పాయకరావుపేట 2.8, ఎస్.రాయవరం 2.6, పరవాడ మండలంలో 1.0 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

రసీదులు లేకుండా విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- నర్సీపట్నం ఏడీఏ శ్రీదేవి



స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ దేవి, ఏవో కాంతమ్మ

దేవరాపల్లి : రసీదు లేకుండా రైతులకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని నర్సీపట్నం ఏడీఏ టి.శ్రీదేవి హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మతో కలిసి బుధవారం స్థానిక మన గ్రోమోర్, హేమ రైతు డిపో, శ్రీ చైతన్య రైతు డిపో తదితర లైసెన్స్ విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల గోడౌన్లలో ఉన్న స్టాక్, రైతులకు ఇచ్చే బిల్లు బుక్‌లు, ఇతర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసే ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వడంతో పాటు రైతులకు తెలిసేలా ధరల పట్టికను దుకాణం ముందు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే ఉపేక్షించబోమన్నారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు.. ప్రాణాలు ముద్దు


- మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటేనే యువతకు భవిత
- డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



నెహ్రూచౌక్‌లో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



రింగ్‌రోడ్డులో ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి: యువత, పిల్లలు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యకర దేశ భవిష్యత్తును సాధించవచ్చని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక రింగ్ రోడ్డు నుంచి నెహ్రూచౌక్ వరకూ నిర్వహించిన ర్యాలీని ఎస్పీ కేవీ మురళీకృష్ణతో కలసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, యువత మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. సమాజాన్ని ప్రభావితం చేసే వ్యక్తులతో సదస్సులు, సమావేశాలు నిర్వహించి యువత, పిల్లలు మాదక ద్రవ్యాలు జోలికి వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృత నిశ్చయంతో పనిచేస్తున్నామని, అందులో భాగంగా విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడి యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులకు వారిని తీసుకు వచ్చిన పాఠశాల యాజమాన్యాలకు అభినందనలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మండలాల్లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీలు నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల నియంత్రణకు 100 రోజుల కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కలెక్టర్ ఆధ్వర్యంలో 63 గ్రామ స్థాయి కమిటీలు, 16 మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కమిటీల ద్వారా ప్రజల్లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా చైతన్యం పెంపొందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి రవాణా, దుర్వినియోగం అరికట్టేందుకు కఠిన చర్యల్లో భాగంగా 4 స్టాటిక్ చెక్ పోస్టలతో పాటు 11 డైనమిక్ చెక్ పాయింట్లను గుర్తించి, ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టినట్లు తెలిపారు. జిల్లా కంట్రోల్ రూమ్ నుంచి చెక్ పోస్టల వద్దనున్న సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. యువతను చెడు మార్గం వైపు నడిపించే మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అమ్మకాలు, వినియోగిస్తున్న వారి సమాచారం తెలిస్తే 14500 టోల్‌ఫ్రీ నంబర్, లేదా డయల్ 100/112, లేదా 9440904229 నంబర్లలో తమకు తెలియజేయవచ్చన్నారు. ఇప్పటివరకు 189 కేసులు నమోదు చేసి, 501 మంది నిందితులను అరెస్ట్ చేశామని, వారి నుంచి 7,255 కిలోల గంజాయి, 108 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గంజాయి రవాణాకు పాల్పడుతున్న ఏడుగురు నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అవేర్‌నెస్ ఆన్ వీల్స్ కార్యక్రమంతో పాటు, జిల్లాలోని విద్యాసంస్థల్లో 136 యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతకు ముందు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నెహ్రూ చౌక్‌లో మానవహారంగా ఏర్పాడి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయ భాస్కర్, పి.సత్యనారాయణరావు, ఇన్‌చార్జ్ ఆర్డీవో రమామణి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, సెబ్ ఎస్పీ కె.జైసింహ చౌదరి, అసిస్టెంట్ సెబ్ సూపరింటెండెంట్లు శైలజారాణి, లక్ష్మణరావు, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ మనోహర్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోర్టులో అగ్నిమాపక వాహనాలు ప్రారంభం



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

సాక్షి, విశాఖపట్నం : పోర్టులో అగ్నిమాపక సామర్థ్యాలను గణనీయంగా మెరుగుపరిచేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటున్నామని విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) చైర్మన్ డా.అంగముత్తు అన్నారు. పోర్ట్ ఫైర్ సర్వీస్ స్టేషన్ అవసరాల్లో భాగంగా అద్దెకు తీసుకున్న రెండు కొత్త అగ్నిమాపక వాహనాలను చైర్మన్ బుధవారం ప్రారంభించారు. ఈ ఆధునిక అగ్నిమాపక వాహనాలు, పోర్ట్ ఆటోమోటివ్ విభాగం పరిధిలో ప్రవేశపెట్టారు. ఈ వాహనాల ఏర్పాటు ద్వారా పోర్ట్ డాక్, పరిసర ప్రాంతాలలో అగ్నిప్రమాద నివారణ చర్యలు మరింత మెరుగవుతాయని డా.అంగముత్తు అన్నారు. చెన్నైకు చెందిన ఏబీఎస్ మెరైన్ సర్వీసెస్ లిమిటెడ్ నుంచి ఈ అగ్నిమాపక వాహనాలను రూ.7 కోట్ల ఆర్డర్ విలువతో ఐదేళ్ల కాలానికి అద్దెకు తీసుకున్నామని వివరించారు. ఈ వాహనాలు కేవలం విశాఖపట్నం పోర్ట్ అవసరాలకు మాత్రమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు సైతం అత్యవసర సమయాల్లో వినియోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ వేణుగోపాల్‌తో పాటు విభాగాధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కిటకిటలాడుతున్న కేజీహెచ్

• మందుల కౌంటర్ల వద్ద రద్దీ విపరీతం

మహారాణిపేట(విశాఖ) : కేజీహెచ్‌లో రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వైద్యం కోసం రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. దీంతో వారికి మందులు ఇచ్చే కౌంటర్లు కూడా రద్దీగా ఉంటున్నాయి. మూడు రోజుల నుంచి మందులు ఇచ్చే కౌంటర్లు రోగులు, వారి సహాయకులతో కిటకిటలాడుతున్నాయి. ఈ రద్దీని దృష్టిలో పెట్టుకొని కేజీహెచ్ సూపరింటెండెంట్, కలెక్టర్ గతంలో కౌంటర్లు పెంచారు. ఓపీ విభాగంలో మూడు కౌంటర్లు, ఆంధ్రా బ్యాంక్ పక్కన అయిదు కౌంటర్లు ఏర్పాటు చేసి ఆధునికీకరించారు. గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, కేజీహెచ్ సిబ్బందికి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇందులో ఫార్మాసిస్టులతో కౌంటర్లు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ గత మూడు రోజులుగా అన్ని కౌంటర్లూ కిటకిటలాడుతున్నాయి. ఇక్కడి ఆస్పత్రికి ఉమ్మడి విశాఖ నుంచే కాకుండా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళంతోపాటు ఒడిశా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి రోగులు వస్తుంటారు. మందుల కోసం రోజు వారీ రోగులే కాకుండా పాత రోగులు కూడా చీటీలు తీసుకొని కౌంటర్లకు వస్తుండడంతో రద్దీ ఎక్కువగా వుంది.

జీవితానుభవాల నుంచే కథలు

సీతంపేట(విశాఖ): రచయితకు సాంఘిక బాధ్యత ఉండాలని రచయిత డాక్టర్ ఎం.సుగుణరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన కథా కచేరీలో వైవిధ్య భరితమైన కథలను రచయితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలనేవి ఆకాశంలోంచి ఊడిపడవని, జీవితానుభవాలే కథలకు ముడిసరుకని పేర్కొన్నారు. కథా వస్తువు కోసం జీవితాన్ని, శైలి కోసం సాహిత్యాన్ని చదవాలని సూచించారు. నడుస్తున్న చరిత్రను రికార్డు చేసే సాంఘిక బాధ్యత రచయితకు ఉండాలన్నారు. పీడిత, తాడిత, దళిత, బహుజన, మహిళావాద దృష్టికోణం నేపథ్యంలో వచ్చిన వందలాది కథలను అధ్యయనం చేసిన తర్వాతే ఔత్సాహిక రచయితలు కలం పట్టాలన్నారు. రాజకీయ సామాజిక అంశాలు, సమస్యలను ఆకలింపు చేసుకుని నిబద్ధతగా రాసే ప్రతి రచయిత మంచి సృజనకారుడు అవుతాడని చెప్పారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ జీవితం నుంచే కథానికలు వస్తాయని, కథాశిల్పం సరిగా లేకపోతే కథనం దెబ్బతింటుందన్నారు. సిహెచ్.చిన సూర్యనారాయణ, ఎస్.విజయ్‌కుమార్, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత, కె.వి.ఎస్.మూర్తి, పీవీఆర్ కుమారరావు, పరమేశ్వరరావు, రాధారాణి, సురేష్ తదితరులు కథా పఠనం చేశారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా చైతన్యం రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్



మానవహారంగా ఏర్పడిన పోలీసు సిబ్బంది, అధికారులు

నర్సీపట్నం : యువత మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్ పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కోర్టు అవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి సాగును నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. విద్యార్థులు, యువకులు గంజాయి బారిన పడకుండా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పలితాలపై ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూధన్‌రావు, కక్షిదారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

మాకవరపాలెం : మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో పోలీసులు, అధికారులు, విద్యార్థులతో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐ హరి మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ఈ ర్యాలీలో ఎంపీడీవో చంద్రరావు, ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

'షట్టర్' దొంగల ఆటకట్టు

• ముగ్గురు నిందితుల అరెస్ట్
• రూ.2,41,500 విలువ గల సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న నగర క్రైం డీసీపీ ఎం.వెంకటరత్నం

అల్లిపురం(విశాఖ): రాత్రి వేళల్లో బైక్‌ల దొంగతనాలు, షాపుల షట్టర్ల తాళాలు బద్దలుకొట్టి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని నగర క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర క్రైం డీసీపీ ఎం.వెంకటరత్నం ఈ వివరాలు వెల్లడించారు. పెదగంట్యాడ దొమ్మేటివీధికి చెందిన చిత్తారపు అభిషేక్ అలియాస్ అభి, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం చిన్నపేట, రామాయణ సుబ్బన్నతోటకు చెందిన కింగం హరి గణేష్, భీమవరం, ఎనమదూరు, డేగాపురానికి చెందిన జువ్వాల అశోక్ అలియాస్ బబ్లూ గాజువాక, న్యూపోర్టు, మహారాణిపేట, కంచరపాలెం, ఫోర్టు టౌన్, పెందుర్తి, మల్కాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు షాపుల్లో చోరీలకు పాల్పడ్డారు. వీరిని అరెస్ట్ చేసిన పోలీసులు.. మొత్తం 13 కేసుల్లో రూ.2,41,500 విలువ గల ఆరు సెల్‌ఫోన్లు, రూ.35,400, కెనాన్ 81డీ కెమెరా, 2 బైక్‌లను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మొత్తం రూ.2,70,800 సొత్తు చోరీ చేసినట్లు డీసీపీ తెలిపారు.

చెడు వ్యసనాలకు అలవాటు పడి..

నిందితుల్లో ఒకడైన చిత్తారపు అభిషేక్ భీమవరంలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లినప్పుడు..అక్కడ కింగం హరి గణేష్, జువ్వాల అశోక్‌తో పరిచయం పెంచుకున్నాడు. వారితో కలిసి మద్యం, గంజాయి సేవించి చెడు అలవాట్లకు బానిసయ్యాడు. సులభంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో ముగ్గురూ కలిసి దొంగతనాలు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో అభిషేక్‌పై 2, కింగం హరి గణేష్‌పై 40, జువ్వాల అశోక్‌పై 28 దొంగతనం కేసులు నమోదయ్యాయి. వీటిలో షట్టర్లు బద్దలుగొట్టి షాపుల్లో చోరీలు, బైక్, హుండీల దొంగతనాలు ఉన్నాయి. కాగా.. రాత్రి పూట షట్టర్లకు సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ పెట్టుకోవాలని, షాపుల్లో డబ్బులు ఉంచవద్దని డీసీపీ వెంకటరత్నం దుకాణ యజమానులకు సూచించారు.

అదరగొట్టిన బ్యూటీషియన్లు

• ఉత్సాహంగా జాతీయ బ్యూటీషియన్స్ డే



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న బ్యూటీషియన్స్

తాటిచెట్లపాలెం(విశాఖ): ఆల్ ప్రొఫెషనల్ బ్యూటీ థెరపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రైల్వే స్టేషన్ సమీపంలోని రాయల్ ప్యాలెస్ హాలులో జాతీయ బ్యూటీషియన్స్ డే ఘనంగా జరిగింది. రానున్న రోజుల్లో మరింత మంది బ్యూటీథెరపిస్టులకు అసోసియేషన్‌లో సభ్యత్వం కల్పించి.. మరిన్ని ప్రాంతాలకు అసోసియేషన్ సేవలను విస్తరించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా బ్యూటీషియన్‌లందరూ కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమానికి విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, పలాస, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి మేకప్ ఆర్టిస్టులు, బ్యూటీషియన్స్ పాల్గొని హొసీ, పలు రకాల డ్యాన్స్‌లు, ఫన్ గేమ్స్, ర్యాంప్‌వాక్‌లతో సందడి చేశారు. అనంతరం లక్కీ డ్రా ద్వారా విజేతలకు బహుమతులు అందజేశారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ, వైస్ ప్రెసిడెంట్ శాంతి, సెక్రటరీ జి.జి.బి.లక్ష్మి, ట్రెజరర్ మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

సుత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో సుత్తమ్మ తల్లి

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మతల్లిని ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. మల్లెలు, కనకాంబరాలు, బంతి పువ్వులు, తులసిమాలలు, చామంతులు, గజమాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్ మల్లికార్జునకు ఆత్మీయ వీడ్కోలు



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ సంయుక్త కమిషనర్ రవీంద్ర

విశాఖ సిటీ: విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా పనిచేసి బదిలీపై వెళుతున్న పూర్వ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు సంస్థ అధికారులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. బుధవారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో వీడ్కోలు సభ నిర్వహించారు. గత రెండేళ్లలో వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా మల్లికార్జున నాయకత్వంలో సంస్థ ఎంతో పురోగతి సాధించిందని అధికారులు కొనియాడారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి కీర్తి, సంయుక్త కమిషనర్ రవీంద్ర, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, ప్రధాన ఇంజనీర్ భవానీశంకర్, కార్యనిర్వాహక ఇంజనీర్ బలరామరాజు, చీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, డీఎఫ్ఓ శ్యామల, అధికారులు పాల్గొన్నారు.

ఉక్కు యాజమాన్యానికి కార్మిక శాఖ నోటీసులు

అగనంపూడి(విశాఖ): స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తనను ఆర్థిక నష్టానికి గురి చేసిందని కార్మికుడు శరగడం రామారావు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కార్మిక శాఖ ప్రాంతీయ కమిషనర్ ఉక్కు యాజమన్యానికి నోటీసులు జారీ చేశారు. వచ్చే నెల 5న రికార్డులతో కార్యాలయంలో హాజరు కావాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో శరగడం రామారావు రోజువారి వేతనంతో 1991 నుంచి 2019 మధ్య కాలంలో సుమారు 28 ఏళ్లు పనిచేశారు. ఆ సమయంలో కనీసం వేతనం చెల్లించకపోవడంతో సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు ద్వారా యాజమాన్యాన్ని ప్రశ్నించారు. దీంతో 2021లో కనీస వేతనం చెల్లించి విధుల నుంచి తొలగించారని బాధితుడు తెలిపారు. అప్పట్లో వచ్చిన అరకొర జీతం నుంచి పీఎఫ్ కోత విధించిన యాజమాన్యం.. ఈపీఎఫ్ అధికారులకు కావాల్సిన వివరాలు ఇవ్వకపోవడంతో జాతీయ భద్రతా పెన్షన్ దక్కడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ కోసం పూర్తి వివరాలతో ఉక్కు అధికారులు హాజరు కావాలని ప్రాంతీయ కమిషనర్ ఆదేశించారు.

పాలసంఘం ఎన్నికల్లో టీడీపీ దౌర్జన్యం



పాల సంఘం వద్ద పోలీసు బందోబస్తు



లక్ష్మీపురం పాల సంఘం వద్ద సభ్య రైతులను బయటకు పంపించేస్తున్న పోలీసులు

• తమకు అనుకూల రైతులకే ఓటు హక్కు
• లక్ష్మీపురంలో ఉద్రిక్తత
• ప్రేక్షక పాత్ర వహించిన పోలీసులు

చోడవరం : తీవ్ర ఉద్రిక్తత నడుమ మండలంలో లక్ష్మీపురం పాల సంఘం ఎన్నిక అధికార పార్టీ ఏక పక్షంగా జరిపించుకుంది. ముందస్తుగా పాలసంఘం సభ్యులైన రైతులకు ఎటువంటి సమాచారం లేకుండానే ముందస్తు వ్యూహంతో టీడీపీ నాయకులు తమకు అనుకూలంగా ఎన్నిక చేసుకున్నారు. ఈ దౌర్జన్యంపై ప్రశ్నించిన రైతులను, స్థానిక గ్రామసర్పంచ్‌ను సైతం అక్కడకు రానీయకుండా పోలీసులతో బయటకు పంపించడంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... విశాఖ డెయిరీకి చెందిన లక్ష్మీపురం పాల ఉత్పత్తిదారుల సంఘం పాలకవర్గం గడువు ఇటీవల ముగిసింది. దీనితో సంఘం ఎన్నికలు జరపాలని విశాఖ డెయిరీ నిర్ణయించినప్పటికీ అందుకు సంబంధించిన ఏర్పాట్లు, నోటిఫికేషన్ ఏమీ ఇవ్వలేదు. నిబంధనల ప్రకారం పాలసంఘం సహకార రంగంలో ఉన్నట్టయితే కోఆపరేటివ్ నిబంధనలు ప్రకారం ఎన్నికలు జరగాల్సి ఉంది. కానీ విశాఖ డెయిరీ పాలసంఘాలకు ఆ విధానంలో ఎన్నికలు జరిపించడం లేదు. ఇప్పుడు లక్ష్మీపురం సంఘం ఎన్నిక కూడా అధికార టీడీపీ నాయకులు తమకు నచ్చిన విధానంలో దౌర్జన్యంగా జరిపించారంటూ సర్పంచ్ శిరుచోళ్ల గణపతినాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తుగా ఎన్నికలకు సంబంధించి ఎటువంటి దండోరా, నోటిఫికేషన్ లేకుండా ఆకస్మాత్తుగా బుధవారం ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్థానిక టీడీపీ నాయకులు తమకు అనుకూలమైన విశాఖ డెయిరీ అధికారులను ఎన్నికల అధికారులుగా తెచ్చుకొని తమ పార్టీకి చెందిన వారిని డైరెక్టర్లు, నామినేషన్లు వేయించి, తమ పార్టీకి చెందిన రైతులతో ఓట్లు వేయించుకొని ఎన్నికలు దౌర్జన్యంగా ఏక పక్షంగా జరిపించుకున్నారు. మిగతా రైతులు ఓట్లు వేయడానికి వచ్చినా వారిని బయటకు పంపించి గేట్లు వేసేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ గణపతినాయుడు రైతులకు మద్దతు వెళ్లి ఎన్నికలు నిర్వహిస్తున్న తీరుపై ప్రశ్నించడంతో టీడీపీ నాయకులు వాదనకు దిగడంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న చోడవరం పోలీసు సీఐ శ్రీనివాసరావు తన సిబ్బందితో వెళ్లి పరిస్థితిని అదుపుచేశారు. పోలీసులు వచ్చినా టీడీపీ సభ్య రైతులకు తప్ప మిగతా సభ్యరైతులు ఓటువేసేందు టీడీపీ నాయకులు అనుమతించకపోవడంతో అక్కడకు వచ్చిన పోలీసులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. దీనితో సర్పంచ్‌తో పాటు మిగతా రైతులకు బయటకు పంపించేసి టీడీపీ నాయకులు ఏకపక్షంగా తమకు అనుకూలమైన పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక చేసుకున్నారు. దీనిపై విశాఖ డెయిరీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది రైతులకు ఓటర్ల జాబితాలో లేకుండా పేర్లు తొలగించేశారని ఆయన ధ్వజమెత్తారు. అసలు పాల సంఘం సహకార రంగంలో ఉందా లేక విశాఖ డెయిరీ అధికారులు, డైరెక్టర్ల సొంత జాగీరులో ఉందో తెలియడం లేదని, దీనిపై డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డిమాండ్ చేశారు.

'సీఎంఆర్' క్రికెట్ లీగ్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఎంఆర్ ఎండీ మావూరి మోహన్ బాలాజీ

మద్దిలపాలెం(విశాఖ): సీఎంఆర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్– 2024 విజేతలకు మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో బుధవారం ట్రోఫీల ప్రదానం జరిగింది. సీఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ ఈ కార్యక్రమంలో పాల్గొని విజేత సీఎంఆర్ గోపాలపట్నం జట్టుకు ట్రోఫీతోపాటు రూ.1.15 లక్షల నగదు బహుమతి అందజేశారు. రన్నర్ టీమ్ హైదరాబాద్ ఉప్పల్ సీఎంఆర్ జట్టుకు ట్రోఫీతోపాటు రూ.75 వేలు నగదు బహుమతి అందించారు. మ్యాన్ ఆఫ్ ద సీరీస్‌కు రూ.50వేలు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు రూ.10 వేలు చొప్పున బహూకరించారు.

ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ ఏటా సీఎంఆర్ టెక్స్‌టైల్స్, జ్యూయలర్స్ షోరూంల్లో పనిచేస్తున్న సిబ్బందికి క్రికెట్ ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ లీగ్‌లో సీఎంఆర్ గ్రూప్ అనుబంధ సంస్థలు, సీఎంఆర్ షాపింగ్‌మాల్, సీఎంఆర్ జ్యూయలరీ, సీఎంఆర్ సెంట్రల్, సీఎంఆర్ ఫ్యాషన్స్, కంచి కామాక్షి, మావూరి షాపింగ్‌మాల్ నుంచి 1400 మంది ఉద్యోగులు 100 టీమ్‌లుగా తలపడ్డారని వెల్లడించారు. విజయవాడ, తిరుపతి, ఖమ్మం, హైదరాబాద్, ఒంగోలు, రాజమండ్రి, విశాఖపట్నంలో పోటీలు నిర్వహించినట్లు వివరించారు.

నేడు విశాఖ- పలాస పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పూండి–నౌపడ మెయిన్ లైన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా.. ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను గురువారం రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. పలాస–విశాఖపట్నం(07471) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–పలాస(07470) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం–గుణుపూర్(08522) పాసింజర్ స్పెషల్, గుణుపూర్–విశాఖపట్నం(08521) పాసింజర్ స్పెషల్‌ను రద్దు చేసినట్లు వెల్లడించారు.

రీ–షెడ్యూల్ చేసిన రైళ్లు ఇవే..

పెయిరింగ్ రైళ్ల ఆలస్యం కారణంగా పలు రైళ్లను రీషెడ్యూల్ చేశారు.


• కన్యాకుమారి–దిబ్రూఘర్ (225030 వివేక్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 4 గంటలు ఆలస్యంగా బుధవారం రాత్రి 9.15 గంటలకు బయలుదేరింది.
• సంత్రగచ్చి–సికింద్రాబాద్(07222) స్పెషల్ సుమారు 11 గంటలు ఆలస్యంగా బుధవారం రాత్రి 11 గంటలకు బయలుదేరింది.
• గురువారం ఉదయం 5.15 గంటలకు టాటానగర్‌లో బయలుదేరాల్సిన టాటానగర్–ఎర్నాకుళం (18189) ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా ఉదయం 7.15 గంటలకు బయలుదేరుతుంది.
• గురువారం ఉదయం 5.20 గంటలకు రాయ్‌పూర్‌లో బయలుదేరాల్సిన రాయ్‌పూర్–విశాఖపట్నం(08527) 2 గంటలు ఆలస్యంగా ఉదయం 7.20 గంటలకు బయలుదేరుతుంది.
• గురువారం మధ్యాహ్నం 12.10 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరాల్సిన భువనేశ్వర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(12830) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా సాయంత్రం 3.10 గంటలకు బయలుదేరుతుంది.

8 నుంచి ప్రతి రోజూ వివేక్ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం: ప్రస్తుతం వారానికి ఐదు రోజులు నడుస్తున్న డిబ్రుఘడ్–కన్యాకుమారి– డిబ్రుఘడ్ వివేక్ ఎక్స్‌ప్రెస్ త్వరలో డైలీ ఎక్స్‌ప్రెస్‌గా రాకపోకలు సాగించనుందని వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. జూలై 8 నుంచి డిబ్రుఘడ్– కన్యాకుమారి(22504) వివేక్ ఎక్స్‌ప్రెస్, జూలై 12 నుంచి కన్యాకుమారి–డిబ్రుఘడ్ (22503) వివేక్ ఎక్స్‌ప్రెస్ ప్రతి రోజూ నడుస్తుందని వెల్లడించారు.

కారు బోల్తా.. యలమంచిలి ఎమ్మెల్యే తండ్రికి స్వల్పగాయాలు

అనకాపల్లి–ఆనందపురం హైవేపై ఘటన



గాయపడిన యలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ తండ్రి సత్యనారాయణ

సబ్బవరం: అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తండ్రి సత్యనారాయణకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా.. సుందరపు సత్యనారాయణ బుధవారం సాయంత్రం కారులో యలమంచిలి నుంచి జాతీయ రహదారి మీదుగా విశాఖపట్నం వెళ్తున్నారు. హైవే బైపాస్ రోడ్డులో ఇరువాడ సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణకు ముఖంపై స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే ఆయనను స్థానికులు విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై స్థానిక సీఐ పిన్నంటి రమణను సంప్రదించగా.. ప్రమాదం జరిగిందని, దీనిపై ఎటువంటి ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

క్లుప్తంగా

రెండో రోజూ భారీ వర్షం

కశింకోట: మండలంలో వరుసగా రెండో రోజైన బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దట్టమైన మబ్బులు కమ్మి ఉరుములు, మెరుపులతో వర్షం దంచి కొట్టింది. దీంతో పగటి పూట ఉక్కపోతతో సతమతమైన ప్రజలు వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు. ఈ వర్షం చెరకు తోటలకు బాగా ఉపకరిస్తుందని రైతులు తెలిపారు. భూమిలో కాస్త పదును తగ్గిన తర్వాత ఖరీఫ్ వరి నారుమళ్లు వేయడానికి, దున్నడానికి ఉపకరిస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్కూల్ కిట్ల పంపిణీ



తాళ్లపాలెం హైస్కూల్లో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్లో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. హెచ్ఎం విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీటీసీ సభ్యురాలు లగిసెట్టి భవాని, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యానాయుడు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉల్లింగల రమేష్, జనసేన ప్రతినిధులు కర్రి సత్యనారాయణ, కర్రి గోవింద, పాఠశాల కమిటీ చైర్మన్ గుమ్మడి గోవింద్ పాల్గొని వీటిని అందజేశారు. కిట్లలో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగు, జత బూట్లు, బెల్టు, సాక్సులు ఉన్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ఆరోగ్య సిబ్బందికి శిక్షణ



క్యాన్సర్ వ్యాధిపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కలిగిస్తున్న వైద్యాధికారి తిరుపతిరావు

కశింకోట: క్యాన్సర్ వ్యాధి ప్రాణాంతకమైనదని, దీని లక్షణాలు కనిపిస్తే వ్యాధిగ్రస్తులను వైద్యులకు సిఫార్సు చేయాలని కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తిరుపతిరావు సిబ్బందిని సూచించారు. కశింకోట పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బందికి క్యాన్సర్ వ్యాధిపై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌లో వివిధ రకాలున్నాయన్నారు. ఒక్కో రకం క్యాన్సర్ లక్షణాలు, గుర్తించే విధానాలను వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
కల్కి2898 ఏడీ	:షిర్డిసాయి
కల్కి2898 ఏడీ	:పర్తిసాయి
కల్కి2898 ఏడీ	:వెంకటేశ్వర
కల్కి2898 ఏడీ	:శ్రీసత్య
కల్కి2898 ఏడీ	:రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 35 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	-	-
రెండో రకం	3,900	3,900
మూడోరకం	3,060	3,700

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-18 యూనిట్లు, బీ పాజిటివ్-5 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 294 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 239 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఖరీఫ్ వరి సాగుకు సన్నద్ధం

అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రైతుల్లో ఆశలు మొలకెత్తాయి. ఖరీఫ్ సీజన్ వరి సాగు సన్నద్ధతలో భాగంగా నారు మడుల్ని సిద్ధం చేసే పనిలో బిజీ అయ్యారు. ఆర్బీకేల ద్వారా ఇప్పటికే విత్తనాల పంపిణీ మొదలయింది. విత్తన శుద్ధి చేసుకుని, కొన్నిచోట్ల రైతులు నారుకు సిద్ధమయ్యారు. వ్యవసాయ బోర్లున్న చోట నారు మడిలో విత్తనాలు చల్లారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు మరింత ధైర్యాన్నిస్తున్నాయి.



వెంకుపాలెంలో నారుమడికి నేలను సిద్ధం చేస్తున్న రైతు



తుమ్మపాలలో వ్యవసాయ బోరు ద్వారా నారుమడికి నీరు పెడుతున్న రైతు

- నారు మడుల్ని సిద్ధం చేస్తున్న రైతులు
- తాజా వర్షాలతో విత్తనాలు చల్లేందుకు ఏర్పాట్లు
- మండలంలో ఈ ఏడాది 5,400 ఎకరాల్లో వరి సాగు

అనకాపల్లి: మండలంలో ఈ ఏడాది 5,400 ఎకరాల్లో రైతులు వరిపంట వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరికి కావాల్సిన విత్తనాలను రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల ద్వారా వ్యవసాయాధికారులు పంపిణీ చేస్తున్నారు. ముందుగా ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులు, విత్తనాలు తీసుకెళ్లి, మొలకల శాతం అంచనాకట్టి, విత్తనశుద్ధి చేసే పనిలో ఉన్నారు. గతంలో దుక్కి చేసి సిద్ధంగా ఉన్న పొలాల్లో నారు మడుల్ని వేసేందుకు సిద్ధమవుతున్నారు.

నీరున్న చోట ధీమా

సాగు నీటి వసతి ఉన్న ఆయకట్టు రైతులు ధైర్యంగా నారు వేస్తున్నారు. కాలువల ద్వారా వచ్చే కొద్దిపాటి నీటిని ఆయిల్ ఇంజన్ల సాయంతో పొలాలకు అందిస్తున్నారు. వ్యవసాయ బోర్లున్న చోట విద్యుత్ మోటార్లతో నారు మడులకు ఎప్పటికప్పుడు తడులు పెడుతున్నారు. జూన్ నెలాఖరు కావడంతో కాలువల ద్వారా సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని నీటిపారుదలశాఖ అధికారులను రైతులు కోరుతున్నారు. మరోవైపు వ్యవసాయ పంపుసెట్లకు కనీసం వారం పది రోజుల పాటు రోజంతా విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని వేడుకుంటున్నారు.

26 ఆర్బీకేల ద్వారా విత్తనాలు

మండలంలో ఉన్న 26 ఆర్బీకేల పరిధిలో రైతులకు అవసరమైన వరి విత్తనాలను అధికారుల సిద్ధం చేశారు. కావాల్సిన విత్తనాల పరిమాణం, రకం, తమకున్న వ్యవసాయ క్షేత్రాల ఆధారంగా పేర్లను నమోదు చేసుకున్న రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ఎకరానికి 30 కిలోల చెప్పున ప్రభుత్వ నిబంధనల మేరకు రాయితీపై విత్తనాలు అందిస్తున్నారు. ఇప్పటికే మండల పరిధిలో విస్తృతంగా భూసార పరీక్షలు చేశారు. వీటి ఆధారంగా నారు మడులపై రైతులకు వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. విత్తనాలు చల్లే సమయంలో గెత్తంతోపాటు, వేయాల్సిన ఎరువుల మోతాదుల్ని వివరిస్తున్నారు.

రెండెకరాల్లో వరి సాగు



మాకున్న రెండెకరాల్లో వరి పంట సాగుకు సన్నాహాలు చేసుకున్నా. నారుమడి కోసం నేలను బాగా కలియదున్నా. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు నారుమళ్లు వేసుకునేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి. మాకు వ్యవసాయ బోరుకూడా ఉంది. ప్రభుత్వం సమకూరుస్తున్న వరి విత్తనాలను ఆర్బీకే కేంద్రంలో తీసుకున్నా. దీంతో నకిలీ విత్తనాల భయం పోయింది.

– పెంటకోట సూరిబాబు, తుమ్మపాల గ్రామం

నారుమడిలో జాగ్రత్తలు



ఎకరా పొలంలో వరి సాగుకు 10 సెంట్లకు తక్కువ లేకుండా నారుమడి వేసుకోవాలి. అందులో 5 కిలోల సూపర్‌ఫాస్ఫేట్ వేసుకుంటే నారు దిగుబడి బాగుంటుంది. మొక్క వచ్చాక కిలో యూరియా/డీఏపీ నారుమడిలో చల్లితే మొక్క ఎదుగుదల బాగుంటుంది. నారును పీకేటప్పుడు వేర్లు దృఢంగా ఉండి, నాట్లు వేశాక ఆరంభంలో నీరు తక్కువగా ఉన్నా తట్టుకుంటుంది.

– పీయూబీ రంగాచారి, మండల వ్యవసాయశాఖ అధికారి

సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు



విద్యార్థులతో మాట్లాడుతున జెడ్సీ అయ్యప్పనాయుడు

అనకాపల్లి: వర్షా కాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు సూచించారు. జీవీఎంసీ విలీనగ్రామం కొప్పాక హైస్కూల్ ఆవరణలో విద్యార్థులకు డెంగ్యూ, మలేరియా వ్యాధులపై బుధవారం అవగాహన కల్పించారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో భాగంగా ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాలను వేరు చేయడం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిషేధానికి ప్రతీ విద్యార్థి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఆర్.రవికుమార్, స్వచ్ఛ భారత్ కో ఆర్డినేటర్ డి.భాస్కరరావు, హెచ్ఎం వీఎస్ మణి, శానిటరీ ఉద్యోగులు మాడుగుల అప్పారావు, చిరతా మాణిక్యాలరావు, సీహెచ్ గణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు

అక్రమ చెరువు మూసివేయాలని ఆందోళన



చెరువు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు, సీఐటీయూ నాయకులు

పరవాడ: తానాం గ్రామాన్ని ఆనుకొని రాంకీ యాజమాన్యం అక్రమంగా తవ్విన చెరువును మూసివేయాలని ఆ గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. చెరువును మూసివేయాలని కోరుతూ గ్రామ ప్రజలు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ తానాం గ్రామాన్ని ఆనుకొని రాంకీ యాజమాన్యం తవ్విన చెరువుపై రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేయడం జరిగిందన్నారు. గ్రీన్‌బెల్ట్ నిబంధనలను ఉల్లంఘించి తవ్వకాలు సాగించిన చెరువును మూసివేయాలని ఆదేశాలు ఇచ్చినా మూసివేయకపోవడం అన్యాయమన్నారు. వెంటనే గ్రీన్‌బెల్ట్‌ను అభివృద్ధి చేసి కాలుష్యాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని గనిశెట్టి కోరారు. రొంగలి అప్పారావు, వర్రి భవాని, వి.కన్నంనాయుడు, వర్రి అప్పారావు, ఆర్.ఎర్రయ్యమ్మ, వి.సన్యాసి, దేముడు పాల్గొన్నారు.

● ఆచితూచి..



మనుషుల్లో ఉన్నంత హడావుడి, కంగారు మాకు లేదు. రేసులో తప్ప, మిగిలిన సమయాల్లో మా విధానం.. నిదానమే ప్రధానం అనే రీతిలో వచ్చీపోయే వాహనాలను గమనించుకుంటూ గుర్రాల గుంపు హైవేను దాటుతుండటం చూపరుల్ని ఆకట్టుకుంది. కశింకోటలోని జాతీయ రహదారిపై మనుషులకంటే మిన్నగా, తెలివిగా వాహనాలను గమనించుకుంటూ రోడ్డు దాటుతుండటాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది. నిత్యం రద్దీతో ఉండే ఈ రోడ్డును దాటాలంటే జనాలు బిక్కుబిక్కుమంటూ అడుగేస్తారు. ఇవి మాత్రం వాహనదారులకు ఇబ్బంది లేకుండా రోడ్డు దాటాయి. రోజూ మేత కోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయం, పీహెచ్‌సీ ప్రాంతానికి చేరేందుకు రోడ్డు దాటుతుంటాయి. వీటిని స్థానిక పూసర్లవీధికి చెందిన వ్యక్తి గుర్రం గెత్తం కోసం సాకుతున్నారు.

– కశింకోట

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు

మునగపాక : ఏపీటీఎఫ్ యూనియన్ నాయకులు బుధవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి వెంకటపతిరాజు నేతృత్వంలో పలువురు ఉపాధ్యాయులు సభ్యత్వ నమోదు నిర్వహించారు. తిమ్మరాజుపేట,గణపర్తి, మునగపాక మెయిన్,వాడ్రాపల్లి, తోటాడ హైస్కూళ్లకు వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టారు. యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వై.రాము, బి.శంకరరావు, గౌరవ అధ్యక్షుడు వి.రామ్మోహనరావు, ఉపాధ్యాయులు తాతునాయుడు, అప్పారావు, జగదీష్, వీవీఎస్ సత్యనారాయణ, జిల్లా పూర్వ అధ్యక్షుడు రమణ పాల్గొన్నారు.

పట్టణంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు వినతి



ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనకాపల్లి: పట్టణ కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి గొర్ల తరుణ్ స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు బుధవారం వినతిపత్రం అందించారు. గవరపాలెంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన తరుణ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో గ్రామీణ, పట్టణ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులు చెల్లించలేక విద్యకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో ఎస్ఎఫ్ఐ స్థానిక ప్రతినిధులున్నారు.

బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి



మూలపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మునగపాక : బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు.మండలంలోని మూలపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగప్పలనాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు అందించే సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో సౌకర్యాలున్నాయన్నారు. ఉచితంగా అందిస్తున్న విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం నరసింగరావు, పెద్దలు భీశెట్టి నాగేశ్వరరావు, శరగడం నాగేశ్వరరావు, కాండ్రేగుల ఈశ్వర అప్పారావు పాల్గొన్నారు.

భూసారానికి అనుగుణంగా పంటల సాగు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాగేంద్ర ప్రసాద్

మునగపాక : రైతులు భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని వాడ్రాపల్లిలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో బుధవారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేసుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గించే విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే పచ్చిరొట్ట ఎరువుల వినియోగం అలాగే ఎరువుల వినియోగంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాడ్రాపల్లిలో చౌడు భూములున్నట్లు గుర్తించామన్నారు. ఫౌండేషన్ ద్వారా ఉచితంగా భూసార పరీక్షలు చేస్తారని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు, రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జడ్జి రమేష్

అనకాపల్లి: భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే విద్యార్థి దశలో ఎలాంటి ప్రలోభాలకు లోనవకుండా, చదువుపై ఇష్టాన్ని పెంచుకోవాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్ సూచించారు. స్థానిక గవరపాలెం చిన్నహైస్కూల్ ఆవరణలో అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా 10వ అదనపు న్యాయమూర్తి ఎస్.శ్రీవిద్య ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నియంత్రణ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దని, వాటికి అలవాటు పడితే భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్నా సమీప పోలీస్ స్టేషన్లకు అందించాలని సూచించారు. సమాజంలో మంచి, చెడులను గుర్తించి, జాగ్రత్తతో వ్యవహరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీవీ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహనతో డయేరియా నిర్మూలన



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద

కశింకోట: మండల గ్రామాల్లో ప్రజలకు క్లోరినేషన్ చేసిన మంచినీటిని అందించేందుకు అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యశోద సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డయేరియా నిర్మూలనపై అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానా కాలంలో కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని ప్రజలకు సూచించారు. క్లోరినేషన్ చేసిన నీటినే వాడాలన్నారు. ఎక్కడైనా, ఎవరికైనా డయేరియా వస్తే ఆరోగ్య సిబ్బందిని కలిసి ఓఆర్ఎస్ ద్రావణం , జింక్ మాత్రలను తీసుకుని తగు వైద్య చికిత్స పొందాలన్నారు. ఎంపీడీవో శేషుబాబు మాట్లాడుతూ డయేరియా సోకకుండా గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి, తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్, ఈవోఆర్డీ సోమరాజు, ఎంఈవో నారాయణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పావని, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పీవీ చలపతిరావు ఆశయ సాధనకు కృషి



పీవీ చలపతిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

తుమ్మపాల: నమ్మిన సిద్ధాంతం కోసం తన జీవితాన్ని బీజేపీకి అంకితం చేసిన గొప్ప నాయకుడు పీవీ చలపతిరావు అని పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో చలపతిరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలపతిరావు ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, శాసనమండలి సభ్యుడిగా ఆయన అందించిన సేవల్ని కొనియాడారు. తుమ్మపాల జెడ్పీ హైస్కూల్లో కొలపర్తి శ్రీను ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కొండబాబు, బీవీఎస్ వర్మ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ, జిల్లా నాయకులు వుడా రమేష్, నాగమణి, బొడ్డేడ నాగేశ్వరరావు, గంగుపాం నాగేశ్వరరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో హిమశేఖర్ విద్యార్థుల ప్రతిభ



యు.దేవీగాయత్రి



ఎ.లిఖిత

తుమ్మపాల: ఇంటర్ మొదటి సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ/బెటర్‌మెంట్ ఫలితాలలో డాక్టర్ హిమశేఖర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపీసీలో యు.దేవీగాయత్రి, ఆడారి లిఖిత 464/470 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచినట్లు కరెస్పాండెంట్ కె.జనార్దన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జి.పవన్ కుమార్(463), ఎస్.తరుణ్ కుమార్(462), కె.రోషిణి(461), సీహెచ్ ప్రత్యూష 460, ఎస్.సాయి ప్రవల్లిక(460) ఉత్తమ మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. సీఈసీ గ్రూపులో వి.నందిని 488/500 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరచడంపై ఆనందం వ్యక్తం చేశారు. స్పెషల్ బ్యాచ్‌లలో 90 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఇంత గొప్ప ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాళ్లు కేహెచ్‌వీ భాస్కర్, పి.సురేష్, అధ్యాపకులు పూర్ణ, రమేష్, సతీష్, దుర్గారావు, నాగశివ, నరసింగరావు, మల్లికార్జున, ధర్మలింగం, దివ్య, ప్రియాంక, నాగలక్ష్మిలు అభినందించారు.

వుషు పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన



పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులతో పాఠశాల సీఈవో నిశాంత్, ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి వుషు పోటీల్లో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాజమండ్రిలో ఈ నెల 28న రాష్ట్ర వుషు సంఘ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి చెప్పారు. విద్యార్థులను కోచ్ రమ్య, పాఠశాల సీఈవో కె.నిశాంత్, అభినందనలు తెలిపారు.

క్రీడాకారులు వివరాలు

- జూనియర్ బాయ్స్ విభాగంలో స్టీఫెన్-45 కేజీలు, భార్గవ్-65 కేజీలు, రాహుల్-70 కేజీలు, అభినవ్-75 కేజీలు, యూత్ బాయ్స్‌లో క్రిష్ దేవని-70 కేజీలు.
- జూనియర్ గర్ల్స్ విభాగంలో హిమానిషి పర్మార్- 45 కేజీలు, చార్వి-48 కేజీలు, ఆర్పిత-56 కేజీలు, రోషిణి-60 కేజీలు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ

పరవాడ: తానాం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తానని ఆ గ్రామ సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ అన్నారు. పాఠశాలలో బుధవారం సర్పంచ్ దేవి వెంకటరమణ విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. విద్యార్థులకు అవసరమైన బ్యాగులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం ప్రభుత్వం కల్పిస్తుందని ఆమె చెప్పారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఉప సర్పంచ్ వర్రి మంగలక్ష్మి వసంతరావు, ప్రిన్సిపాల్ ఎస్.కె.శ్రీదేవి, ఎల్‌బీసీ అప్పారావు, వార్డు సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

30న రక్తదాన శిబిరం

యలమంచిలి : ఈనెల 30 ఆదివారం ఉదయం యలమంచిలి పట్టణం కొత్తపేట వద్ద ఉన్న బుజ్జి కూరగాయల షాపు దగ్గర సంకల్పం స్వచ్ఛంద సేవా సంస్థ మరియు బుజ్జి విజిటేబుల్స్ వారి ఆధ్వర్యంలో అఖిల హరిత సంకల్పం వారి ద్వారా రక్తదాన శిబిరం మరియు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు గొలుసుపూడి శ్రీనివాస బుజ్జి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.